# పరిచయం

యోబు, ప్రసంగి రాసిన గ్రంథాలు సార్వకాలికమైన శ్రేష్ఠ గ్రంథాలు. ఈ రెండు హెబ్రీ భాషలో రాసిన కావ్యాలే. ఇవి రెండూ జీవితం అంటే ఏమిటి, బాధలకు కారణం ఏమిటి అన్న విషయాలకు జవాబులను అన్వేషిస్తాయి.

యోబు గ్రంథం మునుపెవ్వరూ రాయనటువంటి ప్రేరణనిచ్చే కవితగా పండితులు గుర్తించారు. దాని ప్రాథమిక నిర్మాణం పదముల అమరికతో గాక, ఆలోచనా అమరికతో కూడినదైయుంది. ఈ ఆలోచనా అమరికలు మూడు విధములైన సమాంతరాలుగా వ్యక్తపరచబడ్డాయి: అదే అర్థమిచ్చునవిగాను, సినానిమస్, యాంటిథెటెక్, మరియు సింతటిక్ (కృతకమైన)విగాను, (1) సినానిమస్ పేరలలిజంలో రెండవలైను మొదటి వరుసను (రిపీట్ చేస్తూ) మరల చెప్పుతూ, కౌప్‌లెట్‌గా రూపొందుతుంది. 4:17లో ఎలీఫజుతో ఆత్మ పలికిన మాటలయందు ఒక ఉదాహరణను కనుగొనవచ్చు: "దేవుని సన్నిధిని మర్త్యులు నీతిమంతులగుదురా? తమ్ము సృజించినవాని సన్నిధిని నరులు పవిత్రులగుదురా?" (2) యాంటిథెటిక్ పేరలలిజంలో – రెండవలైను మొదటి లైనుకు భిన్నమైన ఆలోచనను తెలుపుతుంది. దీనికి ఉదాహరణ, యోబు దేవుని కిచ్చిన జవాబులో కన్పిస్తుంది. 42:5: "వినికిడిచేత నిన్నుగూర్చిన వార్త నేను వింటిని అయితే ఇప్పుడు నేను కన్నులార నిన్ను చూచుచున్నాను." (3) సింతటిక్ పేరలలిజంలో రెండవ లైను కొన్నిసార్లు దాని వెంటవచ్చే లైన్లు మొదటి లైనులోని భావాన్నే డెవెలప్ చేస్తాయి. ఎలీఫజు మాటల్లో ఈ పదానికి ఉదాహరణ కన్పిస్తుంది, 4:19-21:

> జిగటమంటి యిండ్లలో నివసించువారియందు మంటిలో పుట్టినవారియందు,
> చిమ్మట చితికిపోవునట్లు చితికిపోవువారియందు
> మరి ఎన్ని కనుగొనును?
> ఉదయము మొదలుకొని సాయంత్రమువరకు ఉండి
> వారు బద్దలైపోవుదురు.
> ఎన్నికలేనివారై సదాకాలము నాశనమైయుందురు.
> వారి డేరాత్రాడు తెగవేయబడును
> వారు బుద్ధికలుగకయే మృతినొందుదురు.
> ఆలాగుననే జరుగుచున్నది గదా.

మన ప్రయోజనాల దృష్ట్యా యోబు, ప్రసంగి గ్రంథముల సందేశం దాని రూపం కంటె ఎక్కువ ముఖ్యమైనది. నేడు మనకున్నట్టే మూడు నాలుగు వేల సంవత్సరాల క్రింద ఉన్న జనులకు కూడ సమస్యలు ఉన్నాయంటే ఆశ్చర్యంగా ఉంది. మనవలెనే ఆ సమస్యలలో బాధలనుభవించి పరిష్కారం కొరకు వెదకారు. దేవుని సహాయంతో వారు స్పందించినందున వారి తీర్మానాలు ప్రత్యేకంగా మనకు సహాయపడతాయి. దేవుడు లేకుండ మన సమస్యలకు పరిష్కారాలను వెదకడం వ్యర్థమని వారి జీవితానుభవాలు నొక్కి పలుకుతున్నాయి.

కష్టనష్టముల సమస్యతో యోబు సతమతమయ్యాడు. మానవ జీవిత ప్రణాళికలో కష్టనష్టాలు ఎలా చోటు చేసికొంటాయి? కష్టనష్టాలలో తమ భాగంకంటె కొందరు ఎందుకు ఎక్కువ పాలుపొందుతారు? దుష్టులు వర్ధిల్లుతున్నట్టు కన్పిస్తుండగా, మంచివారు ఎందుకు ఎక్కువ బాధననుభవిస్తారో గ్రహించడం ప్రత్యేకించి యోబుకు కష్టతరమయ్యింది (యిర్మీయా 12:1-3లో యిర్మీయా అదే ప్రశ్న నడిగాడు).

తన జీవితంలో సంతోషాన్ని ఎలా కనుగొనాలి? - అనే సమస్యతో సొలొమోను పెనుగులాడాడు. తాను కన్పిస్తున్నంతటి సంతోషంగా వర్ధిల్లిన వ్యక్తి ఉండడనే వాస్తవాన్ని తన జీవితము, రచనలు ఉదహరిస్తున్నాయి. సొలొమోనుకు ఆరోగ్యము, ఐశ్వర్యము, జ్ఞానము ఉంది; అయినా జీవితానికి అర్థమేమో తెలిసికొనగోరి అతడు పరిశీలనగా చూచాడు.

యోబు, ప్రసంగి గ్రంథాలు మనోహరమైన తారతమ్యాలను చూపుతాయి. యోబు ఉత్తముడైన వ్యక్తియైయుండి కూడ, ఆరోగ్యము, ఐశ్వర్యము ఎందుకు కోల్పోయాడో అతడు ఆశ్చర్యపోతున్నాడు. ఆరోగ్యము, ఐశ్వర్యము ఉన్నంత మాత్రాన ఒక వ్యక్తి తప్పక సంతోషం అనుభవించేవాడైయుండనక్కరలేదని సొలొమోను ఉదహరిస్తున్నాడు. ఒకనికి ఆరోగ్యము ఐశ్వర్యము ఉంది - దాని అర్థమేమో ఒకడు తెలిసికొన గోరుచున్నాడు. మరొకడు తన ఐశ్వర్యాన్ని, ఆరోగ్యాన్ని కోల్పోయాడు - అందుకు అర్థమేమో మరొకడు తెలిసికోగోరాడు.

యోబు, సొలొమోనుల జీవిత గాథలు జీవితమనే నాటక రంగంగుండా మనలను తోడుకొనిపోతూ, జీవితమంటే ఏమిటో తెలిసికోవాలనే హృదయ పరిశోధనకు ఒత్తిడి చేస్తాయి. మరణమందు ఏమి సంభవిస్తుంది? మనం తిరిగి బదుకుతామా? మనకు ఏమి సంభవిస్తుందో దాని విషయమై దేవుడు లక్ష్యం కలిగియున్నాడా? సంపదను మనం ఏ దృష్టితో చూడాలి? బాధయొక్క ఉద్దేశమేమి?

క్లిష్ట పరిస్థితి ఏర్పడినప్పుడు దాన్ని ఎలా ఎదుర్కోవాలో యోబు రచన తెలియజేస్తుంది. జీవితంలోని అనేక విషయాలను వాటి ప్రాముఖ్యతలను బట్టి సరియైన దృక్పథంతో అమర్చుకునేలా సొలొమోను మాటలు సహాయపడతాయి. ఏది సంకట స్థితికి లోను చేస్తుంది, ఏది చేయదు అన్న వివేచనకు సహాయం చేస్తాయి.